నమస్తే తెలంగాణ
జనగామ
5 | శనివారం 27 జూలై 2024 | JANAGAON

కాళేశ్వరం వద్ద త్రివేణి సంగమంలో ప్రత్యేక పూజలు చేస్తున్న కేటీఆర్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, కాళేశ్వరం ఆలయంలో కేటీఆర్, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు

కుట్రలు సాగనిక ఎత్తిపోయాల్సిందే..

కాళేశ్వరంపై కాంగ్రెస్ నిర్లక్ష్యాన్ని ఎండగట్టిన బీఆర్ఎస్ బృందం

- నీటిని లిఫ్ట్ చేయకపోవడంపై కేటీఆర్ ఫైర్
- కాళేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు
- గోదావరి నదికి హారతి
- కన్నెపల్లి పంపుహౌస్, మేడిగడ్డ బరాజ్ సందర్శన



లక్ష్మీ పంప్‌హౌస్ ఫోర్‌బేను వద్ద కేటీఆర్, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు

జయశంకర్ భూపాలపల్లి, జూలై 26 (నమస్తే తెలంగాణ)/కాళేశ్వరం/మహదేవపూర్ : కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను బీఆర్ఎస్ బృందం బట్టబయలు చేసింది. మేడిగడ్డ వద్ద మానేరు, గోదావరి, ప్రాణహిత నదులు పుష్కలంగా ప్రవహిస్తున్నా కావాలనే లిఫ్ట్ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నదని బహిర్గతం చేసింది. నీటిని నిల్వ చేయకుండా కన్నెపల్లి పంపుహౌస్‌లోని 17 మోటర్లను రన్ చేసి రోజుకు 3 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేసే అవకాశమున్నా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తూ రైతుల నోట్లో మట్టి కొడుతున్నదని బృందం ధ్వజమెత్తింది. బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం ఆదేశాల మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఆధ్వర్యంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం శుక్రవారం కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించింది. ఉదయం 10 గంటలకు రామగుండం నుంచి చెన్నూరు మీదుగా కాళేశ్వరానికి చేరుకున్నది. ప్రాజెక్టు బ్రిడ్జిపై ఆగి కాళేశ్వరం వరద ప్రవాహాన్ని పరిశీలించింది. అనంతరం అక్కడి నుంచి కాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవాలయాన్ని సందర్శించింది. రాజగోపురం వద్దకు రాగానే పార్టీ యువజన నాయకుడు జక్కు రాకేశ్ బృందానికి స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతించారు. మహాగణపతికి పూజలు చేసి కాళేశ్వర ముక్తీశ్వరస్వామికి అభిషేకం చేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందాన్ని అర్చకులు శేష వస్త్రాలతో సన్మానించారు. అనంతరం గోదావరి నది తీరం పుష్కరఘాట్ వద్ద త్రివేణి సంగమంలో గోదావరికి పూజలు చేసి హారతి ఇచ్చారు.

బరాజ్‌ల సందర్శన

కేటీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ బృందం కన్నెపల్లి పంపుహౌస్‌ను సందర్శించింది. అక్కడి మోటర్ల స్థితిగతులను కేటీఆర్ ఇరిగేషన్ ఎస్ఈ కరుణాకర్, ఈఈ తిరుపతిరావును అడిగి తెలుసుకున్నారు. 17 మోటర్లు పంపింగ్‌కు సిద్ధంగా ఉన్నాయా, ఏమైనా సాంకేతిక లోపాలు ఉన్నాయా, ఇప్పటికిప్పుడు మోటర్లు రన్ చేసి పంపింగ్ చేయొచ్చా అని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం మానేరు, గోదావరి ప్రవాహం ఎంత వస్తుంది.. ప్రాణహిత ప్రవాహం ఎంత ఉందని తెలుసుకున్నారు. మేడిగడ్డ వద్ద రోజుకు 10 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వృథాగా పోతుందని, అన్నారం బరాజ్ ద్వారా సుమారు 14 వేల క్యూసెక్కుల నీరు మేడిగడ్డ వైపు వదులుతున్నట్లు ఎస్ఈ, ఈఈలు కేటీఆర్‌కు వివరించారు. నీటిని నిల్వ చేయకుండానే 17 పంపులతో ప్రస్తుతం రోజుకు 3 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేయవచ్చని చెప్పారు. అయితే, ఎన్‌డీఎస్‌ఏ నుంచి ఎలాంటి అనుమతి రాకపోవడంతో నీటిని పంపింగ్ చేయడం లేదని తెలిపారు. అనంతరం మేడిగడ్డ బరాజ్‌కు చేరుకొని ప్రాణహిత ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నేతలు నీటి ప్రవాహాన్ని చూస్తూ మురిసిపోతూ సెల్ఫీలు దిగారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

ఎగువ నుంచి వస్తున్న వరదతో కళకళలాడుతున్న మేడిగడ్డ బరాజ్

లక్ష్మీ(కన్నెపల్లి) పంప్‌హౌస్‌లో కేటీఆర్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు

కాంగ్రెస్ నాయకులకు మంచి బుద్ధి ప్రసాదించు..

మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

'దేవుడా.. ఈ కాంగ్రెస్ నాయకుల మనసు మార్చి.. వాళ్లకి మంచి బుద్ధి ప్రసాదించు'.. అని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని వేడుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు అందాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుతూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పూజలు చేశారు. ఈ సందర్భంగా వేముల ప్రశాంత్‌రెడ్డి కాంగ్రెస్ నాయకుల బుద్ధి మారాలని ప్రత్యేక పూజలు చేసి, ఈ విషయాన్ని ట్విట్టర్ వేదికగా పంచుకున్నారు.

కాజీపేటలో ధర్నా కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, చిత్రంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, శ్రేణులు



హామీలు అమలయ్యే దాక ఉద్యమం కొనసాగిస్తాం

- తెలంగాణ హక్కుల కోసం ఎంపీలు పోరాడాలి
- పార్లమెంట్‌ను స్తంభింపజేయాలి
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్
- రాష్ట్రంపై కాంగ్రెస్, బీజేపీది సవతి తల్లి ప్రేమ
- బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్
- బడ్జెట్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివక్షపై కాజీపేటలో నిరసన

ప్లకార్డుతో నిరసన తెలుపుతున్న బోయినపల్లి

కాజీపేట, జూలై 26: కేంద్రబడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని, తెలంగాణలోని కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు 16మంది పునర్‌విభజన చట్టంలో పొందుపరిచిన హక్కులను సాధించేవరకు పార్లమెంట్‌ను స్తంభింపచేయాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. కాజీపేట చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌ల్లో నిధుల కేటాయింపులో వివక్ష, విభజన చట్టంలోని హామీల విస్మరణపై శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బోయినిపల్లి హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విభజన చట్టంలోని హామీలను విస్మరిస్తున్నాయన్నారు. అన్ని అర్హతలు ఉన్న కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ ఫ్యాక్టరీ ఏర్పాటుతో వరంగల్ అనేక పరిశ్రమలతో ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. విభజన చట్టంలోని హామీలను సాధించేవరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. పులిలా ఉన్న మోదీ మూడోసారి ఎన్నికల్లో పిల్లిలా మారిపోయారని, మిత్రపక్షాలైన టీడీపీ, జనతాదళ్ యునైటెడ్ ఎంపీల చేతుల్లో కీలుబొమ్మగా పాలన సాగుతోందని ఆరోపించారు. ఆంధ్రా సీఎం చంద్రబాబునాయుడు అనేక ప్రాజెక్టులను తీసుకువెళ్లాడని, వెనుకబడిన జిల్లాల పేరుతో పెద్ద ఎత్తున నిధులు కేటాయింపులు చేసుకున్నారన్నారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఎలాంటి నిధులను తీసుకురాలేదని, బీజేపీ తెలంగాణకు రూపాయి నిధులను కేటాయించలేదన్నారు. బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ విభజన హామీలైన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు కర్మాగారం, ములుగులో గిరిజన విశ్వవిద్యాలయానికి కేంద్రం నిధులు కేటాయించకపోవడం బీజేపీ తెలంగాణ, వరంగల్‌పై చూపుతున్న వివక్షకు నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంపై కాంగ్రెస్, బీజేపీలు సవతి తల్లి ప్రేమ చూపుతున్నాయని మండిపడ్డారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఉద్యమంలో వామపక్షాలు, ప్రజాస్వామ్యవాదులు కలిసి రావాలని కోచ్ ఫ్యాక్టరీ సాధించేవరకూ పోరాటం ఆపబోమని స్పష్టంచేశారు. కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్లు సంకు నర్సింగరావు, ఇండ్ల నాగేశ్వర్‌రావు, మాజీ కార్పొరేటర్ దాస్యం విజయ్‌భాస్కర్, దిడ్డి భాగ్య-కుమారస్వామి, జోరిక రమేశ్, మరుపల్లి రవి, బీఆర్ఎస్ నాయకులు బీఆర్ఎస్ నాయకులు శిమరుల్ల దశరథం, గబ్బెట శ్రీనివాస్, కాటాపురం రాజు, జనార్దన్‌గౌడ్, పాలడుగు శివకుమార్, తేలు సారంగపాణి, బస్స యాదగిరి, సంచు అశోక్, నయిం జుబేర్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో సారలమ్మ పూజారి మృతి

ఒకే నెలలో ఇద్దరు పూజారుల కన్నుమూత

మృతి చెందిన పూజారి కాక సంపత్

తాడ్వాయి, జూలై 26 : సారలమ్మ దేవత ప్రధాన పూజారి కాక సంపత్(35) అనారోగ్యంతో శుక్రవారం మధ్యాహ్నం మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సంపత్‌కు కుటుంబ సభ్యులు చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం ఆరోగ్య పరిస్థితి విషమించి ఇంటివద్దనే మృతిచెందాడు. అతడి తల్లి కాక అమృతమ్మ సారలమ్మ దేవత ప్రధాన పూజారిగా కొనసాగుతున్నారు. రెండేళ్లకోసారి జరిగే అమ్మవార్ల మహాజాతరలో భాగంగా తల్లిని గద్దెపైకి చేర్చే క్రమంలో పూజారులకు ఇబ్బంది తలెత్తకుండా సంపత్ సేవలను అందిస్తాడు. జాతర ప్రారంభానికి 14 రోజుల ముందు నుంచే ఎంతో నిష్టతో సారలమ్మ దేవత ప్రధాన పూజల్లో పాల్గొంటాడు. గత జాతరలో ఎంతో ఉత్సాహంగా పనిచేసిన సంపత్ అకాలమృతితో పూజారుల కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, ఒకే నెలలో సమ్మక్క పూజారి మల్లెల ముత్తయ్య, సారలమ్మ పూజారి కాక సంపత్ మృతిచెందడంతో వారి కుటుంబాలు, గ్రామాల్లో విషాదఛాయలు అలుకున్నాయి. ఈ నెల 20న ముత్తయ్య అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఇంటివద్దనే మృతిచెందాడు. ఆ విషాదం నుంచి పూజారుల కుటుంబాలు తేరుకోక ముందే 6 రోజుల వ్యవధిలోనే సారలమ్మ పూజారి కన్నెపల్లిలో అనారోగ్యంతో మృతి చెందాడు.

ఏటూరునాగారం: పుష్కరఘాట్ వద్ద గోదావరి ప్రవాహం

పేరూరు వద్ద 17.520 మీటర్లు..

వాజేడు: మండలంలోని పేరూరు వద్ద శుక్రవారం సాయంత్రం 6 గంటలకు గోదావరి నది ప్రవాహం 17.520 మీటర్ల(54 అడుగులు)కు చేరినట్లు సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. మండలంలోని టేకులగూడెం శివారులోని రేగుమాగు వాగు వద్ద హైదరాబాద్ టు భూపాలపట్నం ఎన్‌హెచ్-163ను గోదావరి వరద ముంచెత్తింది. దీంతో ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలకు 5 రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. మండలకేంద్రం నుంచి గుమ్మడిదొడ్డి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపైకి వరద నీరు చేరడంతో వాజేడు, గుమ్మడిదొడ్డి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పేరూరు, వాజేడు, పూసూరు, ఎడ్జర్లపల్లి గ్రామల మీదుగా గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నది.

రామన్నగూడెం వద్ద 2వ ప్రమాద హెచ్చరిక దాటి..

ఏటూరునాగారం : ఏటూరునాగారం మండలం రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద శుక్రవారం సాయంత్రం 6 గంటల వరకు గోదావరి నది రెండో ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహిస్తున్నది. పుష్కరఘాట్ వద్ద 15.910 మీటర్లుగా ప్రవహిస్తుండడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. గోదావరి వరద పెరిగి రామన్నగూడెం-రాంనగర్ మధ్యలోని జీడి వాగులోకి చేరడంతోపాటు ఇటు ఏటూరునాగారంలోని జంపన్నవాగులోకి ఎదురెక్కుతున్నది. గోదావరి వరద పెరుగుతుండడంతో రామన్నగూడెం సమీపంలో దెబ్బతిన్న కరకట్ట వద్ద నీటి పారుదలశాఖ అధికారులు ఇసుక బస్తాలు నింపి అడ్డుగా వేస్తున్నారు. మూసేసిన షెటర్ల కింది నుంచి రామన్నగూడెం, ఓడవాడలోని ముంపు ప్రాంతంలోకి వరద చేరుతున్నది. దీంతో అధికారులు అక్కడి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

మళ్లీ ఉప్పొంగిన గోదావరి

- కాళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువలో ప్రవాహం
- రాత్రి వరకు మరింత పెరిగే అవకాశం
- రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద దాటిన రెండో ప్రమాద హెచ్చరిక

కాళేశ్వరం, జూలై 26 : గోదావరి నది మళ్లీ ఉప్పొంగి ప్రవహిస్తున్నది. కాళేశ్వరం వద్ద ఉగ్రరూపం దాల్చి మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువలో ప్రవహిస్తున్నది. తెలంగాణ, మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు కాళేశ్వరం వద్ద ప్రాణహిత నది 9,54,300 క్యూసెక్కులుగా 12.53 మీటర్ల ఎత్తును దాటి ప్రవహిస్తూ లక్ష్మీబరాజ్ వైపు పరుగులు తీస్తున్నది. పుష్కరఘాట్ పూర్తిగా మునిగిపోవడంతో భక్తులను స్నానాలకు అనుమతించడం లేదు. గంటగంటకూ గోదావరి పెరుగుతుండడంతో అధికారులు అక్కడే ఉండి గస్తీ కాస్తున్నారు. ఇక అన్నారం బరాజ్‌కు మానేరు, చిన్న, చిన్న కాల్వల ద్వారా 13,600 క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. వచ్చిన నీటిని మొత్తం 66 గేట్లు ఎత్తి దిగువకు వదులుతున్నారు.

వాజేడు: వాహనాలు వెళ్లకుండా టేకులగూడెం జాతీయ రహదారిపై బారికేడ్లు పెట్టిన పోలీసులు

నిత్య సాధనతో నైపుణ్యం

- అంతర్జాతీయ క్రీడాకారుల స్ఫూర్తితో క్రీడల్లో రాణించాలి
- పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా
- ముగిసిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు
- సింగిల్స్ విజేతలు కీర్తి, శశాంక్

విజేతలతో సీపీ అంబర్ కిశోర్ ఝా, వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు

హనుమకొండ చౌరస్తా, జూలై 26 : నిత్య సాధనతో నైపుణ్యం పెంపొందుతుందని, తెలంగాణ నుంచి అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారుల స్ఫూర్తితో క్రీడల్లో రాణించాలని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 10వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ అండర్-17 బాలబాలికల బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం ముగిశాయి. హనుమకొండలోని ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించిన ముగింపు వేడుకలకు సీపీ హాజరై విజేతలకు ట్రోఫీ, పతకాలు, సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. క్రీడాకారులు ఎప్పటికప్పుడు టెక్నిక్స్‌ను ఉపయోగిస్తూ క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రమేశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పింగిళి రమేశ్‌రెడ్డి, కోశాధికారి నాగకిషన్, నిర్వహణ కార్యదర్శి జితేందర్‌రెడ్డి, వరంగల్ ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి రవీందర్‌రెడ్డి, క్రీడా పరిశీలకుడు సుధాకర్, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మోహన్‌రావు, అసోసియేషన్ బాధ్యులు, టెక్నికల్ ఆఫీషియల్స్ కొమ్ము రాజేందర్, వైకుంఠం, రాజ్‌కుమార్, దుర్గాప్రసాద్, విశ్వప్రకాశ్ పాల్గొన్నారు.

చాంపియన్స్ వీరే..

అలాగే బాయ్స్ సింగిల్స్‌లో శశాంక్ వనమాల(రంగారెడ్డి) సాయి నచికేత్ భరత్‌రాజ(మెదక్)పై వరుస సెట్లలో.. గర్ల్స్ సింగిల్స్‌లో కీర్తి మంచాల(జనగామ) ఆలూరు అక్షయ చౌదరి(మెదక్)పై గెలుపొందింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో శ్రీఆదిత్య బొమ్మకంటి -రిషితా పాండే(రంగారెడ్డి) జే శౌర్యకిరణ్-కీర్తి మంచాల(జనగామ)పై గెలుపొందారు. బాయ్స్ డబుల్స్‌లో సాయి సిద్ధార్థ రాయప్రోలు-యువ సూర్య జాగర్లమూడి(హైదరాబాద్) జోడీ ధ్రువపర్షద్ సేథీ-వివేక్ బొల్లం(రంగారెడ్డి)పై విజయం సాధించారు. గర్ల్స్ డబుల్స్‌లో లక్ష్మి రిధిమా దేవినేని-సరయు సూర్యనేని(హైదరాబాద్) జోడీ అనుసంజన మురళీ-గాదె శృతి గ్రేస్‌రెడ్డి(రంగారెడ్డి)పై గెలుపొందింది.

జోగీరామ్‌కు అరుదైన గౌరవం

ఐక్యరాజ్య సమితి సమావేశాలకు ఆహ్వానం

జోగీరాంనాయక్

గార్ల, జూలై 26: మండలంలోని చిన్న బంజర గ్రామానికి చెందిన గిరిజన బిడ్డ తేజావత్ జోగీరాంనాయక్‌కు అరుదైన గౌరవం లభించింది. యూఎన్ఏ ఆఫ్రికాలో జరిగే ఐక్యరాజ్య సమితి సమావేశాలకు ఆహ్వానం అందింది. బంజరా సేవా సమితి ద్వారా ఆయన చేసిన సేవలను గుర్తించి స్పెషల్ కన్సల్టేటివ్ స్టేటస్‌ను ఇచ్చింది. 2020-21న అప్రూవల్ ఫర్ ది ఎకనామిక్ సోసల్ అఫైర్ రెగ్యులర్ సెషన్, రిలిజీయన్ అండ్ లింగ్విస్టిక్ మైనార్టీస్, యునైటెడ్ నేషన్ హెడ్క్వార్టర్స్ అనే అంశాలపైన జోగీరాం సెమినార్లలో పాల్గొన్నాడు. ప్రముఖులు, మేధావులు, వివిధ సంస్థల ప్రతినిధులు ఆయనకు అభినందనలు తెలియజేశారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి జరిగే ఐక్యరాజ్యసమితి సమావేశంలో ఆయన పాల్గొననున్నారు.